సాక్షి
అనకాపల్లి
మంగళవారం : 1 : జూలై : 2025



ప్రతి వారం ప్రదక్షిణలు

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 313 అర్జీలు వచ్చాయి. పదే పదే రావాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

8లో



వరాహావతారం

చోడవరం: కేశవస్వామి ఆలయంలో వరాహావతారంలో జగన్నాథస్వామి సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు.



నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

కళాశాలలకు సర్టిఫికెట్లు నో



డిగ్రీ, పీజీ కాలేజీలకు ఏయూ మార్క్ ట్రీట్‌మెంట్
ఫీజులన్నీ చెల్లించి సీడీసీ నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తేవాలని హుకుం

- కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలంటున్న ఉన్నత విద్యాశాఖ
- లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరిక
- ఏడాదిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయని ప్రభుత్వం
- నలిగిపోతున్న కాలేజీ యాజమాన్యాలు

అనకాపల్లిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్ల కోసం ఆంధ్రా యూనివర్సిటీలో సంప్రదించింది. ఫీజులన్నీ చెల్లించి కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తెచ్చుకుంటే ఇస్తామని ఏయూ అధికారులు తెగేసి చెప్పారు. చేసేదేమీ లేక ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోయినప్పటికీ కాలేజీ యాజమాన్యం ఫీజులు చెల్లించాల్సి వచ్చింది.

నగరంలోని మరో డిగ్రీ కాలేజీది ఇదే పరిస్థితి. ఏయూ నుంచి సర్టిఫికెట్లు రావాలంటే యాజమాన్యం డబ్బులు కట్టాల్సిందేనని వర్సిటీ అధికారులు చెప్పారు. ఏడాదిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడంతో ఫీజులు కట్టలేమని విద్యార్థులు స్పష్టం చేశారు. ఫీజులు చెల్లించకుండా సర్టిఫికెట్లు ఇవ్వడం తమ వల్ల కాదని కాలేజీ యాజమాన్యం స్పష్టం చేయడంతో కొద్ది మంది విద్యార్థులు అప్పులు చేసి మరీ తెచ్చి కట్టారు.

ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని 335కి పైగా డిగ్రీ, పీజీ కాలేజీల్లో ఇదే పరిస్థితి ఉంది. ఒకవైపు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదు. సర్టిఫికెట్లు కావాలంటే డబ్బులు చెల్లించాల్సిందేనని యూనివర్సిటీ యంత్రాంగం తేల్చి చెబుతోంది. మరోవైపు ఫీజులు చెల్లించలేదన్న కారణంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ ఉన్నత విద్యాశాఖ హెచ్చరికలు జారీచేస్తోంది. ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వమని ఏయూ తెగేసి చెబుతుంటే పట్టించుకోని ఉన్నత విద్యాశాఖ... తమ విషయంలో మాత్రం కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగడం దారుణమని కాలేజీ యాజమాన్యాలు వాపోతున్నాయి. **- సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం**

నో డ్యూ సర్టిఫికెట్ ఉంటేనే...!

వాస్తవానికి ఏయూ నుంచి గుర్తింపు పొందిన డిగ్రీ, పీజీ కాలేజీలు 335కి పైగా ఉన్నాయి. ఈ కాలేజీల్లో 20 వేల మందికి పైగా విద్యార్థులు డిగ్రీ, పీజీ కోర్సులను అభ్యసిస్తున్నారు. వీరిలో సగం మందికి పైగా విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. మరోవైపు ఏయూకి అనుబంధంగా ఉన్న కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్ల కోసం సంప్రదిస్తే.. అన్ని రకాల ఫీజులు చెల్లించి కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తెచ్చుకుంటేనే ఇస్తామని ఏయూ యంత్రాంగం స్పష్టం చేస్తోంది. గత 7–8 నెలలుగా ఆంధ్రా యూనివర్సిటీ.. డిగ్రీ, పీజీ కాలేజీలకు సర్టిఫికెట్లను జారీ చేయడం లేదు. మరోవైపు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీచేయకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ ఉన్నత విద్యాశాఖ హెచ్చరికలు జారీచేస్తోంది. ఏయూ అధికారులు మాత్రం తమకు చెల్లించాల్సిన ఫీజులన్నీ క్లియర్ చేస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తెగేసి చెబుతుండటంతో కాలేజీ యాజమాన్యాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మరోవైపు కాలేజీలకు సర్టిఫికెట్ల జారీలోనూ మామూళ్ల కోసం సీడీసీ సిబ్బంది ముప్పతిప్పలు పెడుతున్నారని విమర్శలున్నాయి.

గతంలో ఠంచనుగా...!

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో క్యాలెండర్ ప్రకటించి మరీ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు జరిగేవి. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమయ్యేవి. అనంతరం విద్యార్థులు కాలేజీలకు చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదు. 'గత ప్రభుత్వంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో వేస్తుండటంతో వారు చెల్లించడం లేదు. అందుకే మేం వచ్చాక నేరుగా కాలేజీ అకౌంట్లలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు జమ చేస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు వాగ్దానాలిచ్చారు. గెలిచిన తర్వాత ఏడాది కాలంగా మాకు బకాయిలు చెల్లించడం లేదు' అని నగరంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాని 'సాక్షి' వద్ద వాపోయారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా తప్పు చేస్తూ.. తమపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బెదిరించడం దారుణంగా ఉందని మండిపడ్డారు.

అన్ని వ్యాపార సంస్థలు జీఎస్టీ పరిధిలోకే..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- ఎవరికీ మినహాయింపు లేదు
- జీఎస్టీ రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలి
- సమన్వయ కమిటీ అధికారుల సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: కొన్ని వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చట్టం కింద నమోదు చేసుకోవాల్సి ఉన్నప్పటికీ పన్ను వలయానికి భిన్నంగా ఉన్నాయని, వారిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కలెక్టర్ విజయ కృష్ణన్ స్పష్టం చేశారు. జీఎస్టీ రెవెన్యూ వసూళ్లలో ప్రగతి సాధించాలనే అంశంపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ వై.కిరణ్ కుమార్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్టీ పరిధికి వెలుపల ఉన్న వారిని పన్నుల పరిధిలోకి తీసుకురావడానికి వీలుగా జిల్లా పరిశ్రమల శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. అటువంటి వర్తకులు సమాచారాన్ని సంబంధిత శాఖల అధికారులు, వాణిజ్య పన్నుల శాఖకు తక్షణమే పంపించాలన్నారు.

పాత బకాయిదారులను తక్షణమే గుర్తించాలని, జిల్లాలో వస్తు సేవల పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, బకాయిదారుల ఆస్తులను గుర్తించడంలో జీఎస్టీ అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సంబంధిత అధికారులను, లీడ్ బ్యాంక్‌తో పాటు ఇతర బ్యాంకు అధికారులను ఆదేశించారు. జీఎస్టీ అధికారుల నుంచి జారీ చేసే నోటీసుల్లో బకాయిదారులకు సంబంధించి ఖాతా వివరాలు, వారి ఖాతాలను స్తంభింపజేయడం వంటి అంశాల ఆవశ్యకతను కలెక్టర్ అధికారులకు వివరించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల అధికారులు బకాయిదారులకు సంబంధించి ఆస్తుల వివరాలు, బిల్డర్లకు సంబంధించి కొత్త రిజిస్ట్రేషన్ వివరాలను జీఎస్టీ అధికారులకు అందించాలన్నారు. అక్రమ మైనింగ్‌పై మైనింగ్ అధికారులు, రవాణా శాఖ అధికారులు వాణిజ్య పన్నుల శాఖతో సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఉప కమిషనర్ అపర్ణ, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్, జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ అధికారి మన్మధరావు, జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి ఎం.శ్రీనివాస్, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, జిల్లా పౌరసరఫరాల అధికారి కె.మూర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ కె.సత్యనారాయణ, ఎంపీడీవోలు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో చేపల వేటతో నిరసన



బీఎన్ రోడ్డులో వలతో చేపలు పడుతూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, ప్రజలు

రోలుగుంట: స్థానిక నర్సీపట్నం – భీమిలి ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితిపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు కె.గోవింద, ఇ.చిరంజీవిల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల కార్యాలయ సముదాయం కూడలి సమీపంలో చెరువును తలపిస్తున్న రోడ్డు గుంతలో వలతో చేపల పడుతూ తమ నిరసన తెలిపారు. సీపీఎం నాయకుడు మాట్లాడుతూ ఈ గోతుల రోడ్డులో రాకపోకలు చేసే వాహనదారులు అదుపు తప్పి బోల్తాపడి గాయాల పాలవుతున్నారన్నారు. కొవ్వూరు, కె.నాయుడుపాలెం, పాపంపేట, అంట్లపాలెం తదితర గ్రామాల నుంచి గర్భిణులను గాని, క్షతగాత్రులను గాని 108 వాహనంలో తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ రోడ్డు మెరుగుపరచి రవాణా కష్టాలు తీరుస్తామని బూటకపు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి ఏడాదైనా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వాన్ని దూషించిన ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఇప్పుడు ఏం చేస్తున్నారు.. నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు.

సచివాలయ బదిలీలు పూర్తి

- జిల్లావ్యాప్తంగా 3,258 మందికి స్థానచలనం
- కూటమి ఎమ్మెల్యే సిఫార్సు ఉన్నవారికే అనుకూల పోస్టింగ్



విశాఖ డీపీవో కార్యాలయం ఎదుట డిజిటల్ అసిస్టెంట్ల పాట్లు

సాక్షి, అనకాపల్లి: సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 25 నుంచి విశాఖలో జరుగుతున్న కౌన్సెలింగ్ సోమవారంతో ముగిసింది. ఐదు రోజులపాటు ఆయా విభాగాల కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ విధానంలోనే కౌన్సెలింగ్ జరిగింది. అనకాపల్లి జిల్లాలో మొత్తం 522 సచివాలయాల్లో 3,824 మంది ఉద్యోగులు ఉండగా.. వారిలో ఐదేళ్ల కాలపరిమితి పూర్తయిన 3,258 మంది బదిలీల ప్రక్రియలో పాల్గొన్నారు. సొంత మండలంలో పనిచేసే వెసులుబాటు లేకపోవడంతో గ్రామ సచివాలయ ఉద్యోగులు పలు ఇబ్బందులకు గురయ్యారు. అంతేకాకుండా ఇటీవల ప్రభుత్వం రేషనలైజేషన్ విధానంలో భాగంగా జనాభా ప్రాతిపదికన క్లస్టర్ల వారీగా సచివాలయాలను కుదించడం, విస్తీర్ణం ఆధారంగా రైతు సేవా కేంద్రాలను కుదించడంతో సచివాలయం, రైతు సేవా కేంద్రాలు లేనిచోట ఐదేళ్లు పూర్తిగాని ఉద్యోగులు ఎక్కడా పోస్టింగ్ లేకుండా హోల్డ్‌లో ఉండిపోయారు. సచివాలయాలను మూడు గ్రేడ్లుగా విభజించారు. 2,500 లోపు జనాభా ఉంటే 'ఏ' గ్రేడ్‌గా నిర్ణయించి, ఆ సచివాలయంలో ఆరుగురు ఉద్యోగులు ఉంటే చాలని నిర్ధారించారు. జనాభా 2,500–3,500 వరకూ ఉంటే 'బి' గ్రేడ్ సచివాలయంగా 7 లేదా 8 మంది ఉద్యోగులు ఉండాలి. ఇక 3,500కు పైగా జనాభా ఉన్న సచివాలయాలను సీ–గ్రేడ్‌గా పరిగణిస్తారు. 8 మంది ఉద్యోగులు ఉండాలని నిర్ణయించారు.

సిఫార్సు ఉంటేనే నచ్చిన చోటకు..

కూటమి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖ ఉన్నవారికే అనుకూల పోస్టింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఒక్కో నియోజకవర్గం నుంచి కూటమి ప్రజాప్రతినిధులు తమ పార్టీ అనుకూల ఉద్యోగుల జాబితా సంబంధిత అధికారులకు పంపించి కావలసిన విధంగా బదిలీలు చేయించుకున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖ లేని వారికి ఎక్కడో మారుమూల గ్రామానికి బదిలీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఏ ప్రాతిపదికన చేశారో అధికారులకే తెలియకుండా పోయింది.

బదిలీ అయ్యింది వీరికే..

వివిధ హోదాల్లో బదిలీ జరిగిన వారి సంఖ్య ఇలా ఉంది.. అగ్రికల్చర్ అసిస్టెంట్లు–170, యానిమల్ హజ్‌బెండరీ అసిస్టెంట్లు–187, ఏఎన్ఎం–442, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు–315, ఫిషరీస్ అసిస్టెంట్లు–45, హార్టికల్చర్ అసిస్టెంట్లు–89, మహిళా పోలీస్ అండ్ ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు–312, పంచాయతీ సెక్రెటరీలు –155, డిజిటల్ అసిస్టెంట్లు–348, సర్వే అసిస్టెంట్లు–377, వీఆర్వోలు 75, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు–326, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీలు–46, వార్డు ఎనిమిటీస్ సెక్రెటరీలు–45, వార్డు ఎడ్యుకేషన్ సెక్రెటరీలు–50, వార్డు ఎనర్జీస్ సెక్రెటరీలు–3, వార్డు హెల్త్ సెక్రెటరీలు–53, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రెటరీలు–38, వార్డు రెవెన్యూ సెక్రెటరీలు–39. వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రెటరీలు–52, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రెటరీలు–47, వార్డు ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రెటరీలు–44 మందికి బదిలీ జరిగింది.

17 మంది వీఏఏల పరిస్థితి అగమ్యగోచరం

- రేషనలైజేషన్ పేరిట రైతు సేవా కేంద్రాల కుదింపు
- నియమితులై నాలుగేళ్లే కావడంతో బదిలీకి నో చాన్స్
- వారికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో అయోమయ స్థితి

సాక్షి, అనకాపల్లి: బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను కూటమి ప్రభుత్వం ఒక్కటొక్కటిగా కూలదోస్తోంది. రైతుల కోసం సచివాలయాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన ఆర్బీకేల పేరు మార్చి రేషనలైజేషన్ పేరిట వాటి సంఖ్యను తగ్గించారు. సాగు విస్తీర్ణం ఆధారంగా సగటున 970 నుంచి 1000 ఎకరాల సాగు విస్తీర్ణం వరకు ఒక రైతు సేవా కేంద్రం వంతున కుదించారు. అందులో పనిచేసే ఉద్యోగుల్లో ఐదేళ్ల కాలపరిమితి దాటిన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు (వీఏఏ) బదిలీల్లో పాల్గొన్నారు. ఐదేళ్లు పూర్తి కాని వారు మాత్రం అటూ ఇటూ కాకుండా మిగిలిపోయారు. వారికి బదిలీ ప్రక్రియలో పాల్గొనేందుకు అర్హత లేదు.. మరోవైపు వారు పనిచేసే రైతు సేవా కేంద్రం తొలగించడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండిపోయారు. ఇలా జిల్లాలో 17 స్థానాల్లో పోస్టులు కనుమరుగయ్యాయి. ఐదేళ్ల కన్నా తక్కువ సర్వీస్ ఉండడంతో అధికారులు వీరి పోస్టింగ్‌లపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేకపోయారు.

ప్రభుత్వం నుంచి ఎటువంటి క్లారిటీ లేక ప్రస్తుతం వీరి భవితవ్యం గాల్లో తేలుతున్నట్లుగా ఉంది. జిల్లాలో జి.కొత్తపల్లి, తెనుగుపూడి, తురకలపూడి, తైపురం, రాజుపేట, పెదముసిడివాడ, పాపయ్యపాలెం, వెంకటనగరం, లోపూడి, పాత్రేరు–2, కొమిర, పాయకరావుపేట–3, పెదపూడి, ఆర్.వై.అగ్రహారం, రాంపురం, ఎల్.వి.పాలెం, గబ్బాడ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను తొలగించారు. దీంతో ఈ సేవా కేంద్రాల్లో పనిచేసే వీఏఏల పరిస్థితి అయోమయంగా మారింది.

మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు మరో 111 ఎకరాలు

సాక్షి, అనకాపల్లి: నక్కపల్లి మండలంలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్టు రైల్వే సైడింగ్ సౌకర్యం కోసం అదనంగా 111 ఎకరాల భూములను కేటాయిస్తూ సోమవారం పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎస్. యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం 2,080.76 ఎకరాల్లో రెండు దశల్లో చేపట్టనున్న విషయం తెలిసిందే. ఎకరా ధర రూ.51,39,690లుగా నిర్ణయించి ఈ భూములను కేటాయించారు.

- టీడీపీ సానుభూతిపరులతో హోంమంత్రి మంతనాలు
- మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు భూములివ్వాలని ఒత్తిడి
- ససేమిరా అన్న రైతులు..
- ప్రాణాలిచ్చి అయినా కాపాడుకుంటామని స్పష్టీకరణ



క్యాంపు కార్యాలయంలో రైతులతో హోంమంత్రి అనిత సమావేశం

డామిట్

కథ అడ్డం తిరిగింది

నక్కపల్లి :

మండలంలో ఏర్పాటు కాబోయే ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ స్టీల్‌ప్లాంట్‌కు భూములు ఇవ్వమని రైతులను ఒప్పించాలని ప్రయత్నించిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు సోమవారం చుక్కెదురైంది. ఆమె తన క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో వి.వి.రమణ, ఏపీఐఐసీ ఎస్‌డీసీ అనిత, తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. దీనికి పాత్రికేయులు, ఇతర పార్టీలకు చెందిన రైతులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

కేవలం టీడీపీ సానుభూతిపరులైన అతికొద్ది మంది రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో స్టీల్‌ప్లాంట్‌కు భూములు ఇవ్వాలని రైతులను ఒప్పించే ప్రయత్నం చేశారు. దీంతో సమావేశానికి వచ్చిన పలువురు రైతులు భూములు ఇచ్చే ప్రసక్తి లేదని, సర్వే చేయడానికి వస్తే సహించేది లేదని తెగేసి చెప్పారు.

ఇదీ నేపథ్యం..

విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా నక్కపల్లి మండలంలో ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా రాజయ్యపేట, చందనాడ, వేంపాడు, డీఎల్‌పురం, అమలాపురం గ్రామాల్లో 4500 ఎకరాలు సేకరించింది. ఈ భూముల్లో 2వేల ఎకరాలు బల్క్‌డ్రగ్ పార్క్ కొరకు కేటాయించింది. మరో 2080 ఎకరాలను ఈ ఏడాది తెరమీదకు వచ్చిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఎకరా రూ.51.39 లక్షల చొప్పున కేటాయించిన విషయం తెలిసిందే.

రైతులపై ఒత్తిడి పెంచేందుకేనా...!

ఈ సందర్భంగా సమావేశానికి వెళ్లిన పలువురు రైతులు బయటకు వచ్చి స్థానిక ఎమ్మెల్యే అయిన హోంమంత్రి సమావేశం ఏర్పాటు చేయడంతో రైతులకు అండగా నిలుస్తారని ఆశతో వెళ్లామని, కానీ భూములు ఇవ్వాలని ఒప్పించే ప్రయత్నాలు చేయడం సమంజసం కాదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతులను విభజించి పాలించే ప్రయత్నాలు చేస్తున్నారని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల్లోకి వచ్చి రైతులతో నేరుగా సమావేశాలు ఏర్పాటు చేయాలన్న వాదన వినిపిస్తున్నారు.


ఆర్సెలర్ మిట్టల్ కంపెనీ మొదటి విడతలో ఏడాదికి 7.3 లక్షల మెట్రిక్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసేందుకు భూములు కేటాయించాలని కోరడంతో ఇటీవలే ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు భూములు కేటాయించింది. అయితే ఈ స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ ఏర్పాటు చేసేందుకు అదనంగా మరో 3265 ఎకరాలు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో హోంమంత్రి అనిత రంగంలోకి దిగి, రైతులను ఒప్పించే ప్రయత్నాలు చేపట్టారు. మీరంతా భూములు ఇచ్చి సహకరిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని భూసేకరణకు అడ్డు రావద్దని కోరారు. అయితే తరతరాలుగా ఈ భూములే తమకు ఆధారమని, ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చే ప్రసక్తి లేదని రైతులు స్పష్టం చేశారు. సర్వే కోసం భూముల జోలికి వస్తే ప్రాణాలొడ్డి అయినా అడ్డుకుంటామన్నారు. దీంతో సమావేశం ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఖంగుతిన్నారు. ఏం చేయాలో తోచక ఇప్పటికిప్పుడే భూములు సేకరించడం లేదని, నోటిఫికేషన్ విడుదల చేయలేదని, కేవలం ప్రతిపాదనలు మాత్రమేనంటూ సముదాయించుకున్నారు.

హోంమంత్రి తీరు దారుణం




హోంమంత్రి సమావేశం ఏర్పాటు చేసి భూములు ఇవ్వాలని కోరడం చాలా దారుణం. ఇప్పటికే ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన వారంతా రోడ్డున పడ్డారు. జాతీయరహదారిని ఆనుకుని ఉన్న భూములను కారు చౌకగా తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. దళితులమైన మేమంతా భూములు ఇచ్చేస్తే రాబోయే రోజుల్లో ఎలా బతుకుతాం, ప్రాణాలొడ్డైనా సరే భూ ములు కాపాడుకుంటాం. –అనపర్తి పాండు, రైతు కాగిత

అండగా ఉంటారనుకుంటే....



ఇప్పటికే మా గ్రామంలో రెండు దిక్కులా ఉన్న భూములను బల్క్‌డ్రగ్ పార్క్, స్టీల్‌ప్లాంట్ కొరకు సేకరించారు. నలువైపులా కంపెనీల కోసం భూములు తీసేసుకుంటే ఇక ఎక్కడ బతకాలి. ఎట్టి పరిస్థితుల్లోను భూములు ఇవ్వడానికి ఒప్పుకోం. రైతులకు మంత్రి అండగా నిలవాలి.
–గింజాల వెంకటరమణ, రైతు డీఎల్‌పురం

భూములిచ్చేస్తే ఎలా బతకాలి...



నాకున్న కొద్దిపాటి భూమిలో నా తల్లిదండ్రులతో కలసి కష్టపడి కొబ్బరి మొక్కలు వేసి పెంచుకుంటున్నాను. ఫలసాయం చేతికి వచ్చే సమయంలో స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ కోసం భూములు సేకరిస్తారని తెలిసింది. మా కుటుంబానికి ఉన్న ఒకే ఒక్క ఆధారం ఈ భూమి మాత్రమే. ఎట్టి పరిస్థితిలో భూముల జోలికి రానివ్వను. –పద్మనాభుని శ్రీను, రైతు డీఎల్‌పురం

ఈనెల కూడా కందిపప్పు లేనట్టే..!



అనకాపల్లి టౌన్ : కందిపప్పు బలవర్ధకమైన ఆహార పదార్థం. చక్కగా ప్రొటీన్ లభిస్తుంది. సామాన్యుడు చౌకధరల దుకాణంలో లభించే కందిపప్పుకు అర్రులు చాస్తుంటాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలలుగా రేషన్ షాపులలో కందిపప్పు, రాగులు, గోధుమపిండి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రాగులు, గోధుముల సంగతి పక్కన పెడితే కనీసం కందిపప్పు సరఫరా చేయడంలో కూడా ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ నెల కూడా కందిపప్పును అడగొద్దని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 5,37,038 మంది కార్డుదారులకు 14,99,000 యూనిట్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 7652 మెట్రిక్ టన్నుల బియ్యం, 264 మెట్రిక్ టన్నుల పంచదార, 546 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 544 మెట్రిక్ టన్నుల గోధుమ పిండి, 1628 మెట్రిక్ టన్నుల రాగులు సరఫరా చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవి నిలిచిపోయాయి. కొన్ని నెలలు అరకొరగా పంపిణీ చేసిన ప్రభుత్వం ఆరు నెలలుగా పూర్తిగా నిలిపివేసింది. పేదలకు నిత్యావసర వస్తువైన కందిపప్పును సరఫరా చేయలేని ప్రభుత్వం రాగులు, గోధుమ ఇంకేమి ఇస్తుందని కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీరు చూస్తుంటే రేషన్ షాపుల్లో పూర్తిగా కందిపప్పు నిలిపివేస్తుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

24 గంటలూ జగన్నాథుని ఉచిత దర్శనం



ఇంద్రద్యుమ్న హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత దర్శనం

సాక్షి ఎఫెక్ట్..

అనకాపల్లి టౌన్‌: పట్టణంలోని గూడ్స్‌రోడ్‌ ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువైన జగన్నాథ స్వామిని 24 గంటలూ ఉచిత దర్శనం అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. స్వామిని దర్శించుకొనేందుకు భక్తులకు ఉదయం గంట సేపు మాత్రమే అవకాశం కల్పించడంపై 'సాక్షి'దిన పత్రికలో 'జగన్నాథుని ఉచిత దర్శనం గంటసేపే'అని ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆలయ ఈవో బి.మురళీకృష్ణ స్పందించారు. 24 గంటలూ ఉచిత దర్శనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

'తనఖా పెడితే.. ఇల్లే నాది అంటున్నాడు'


అండిబోయిన రమేష్‌

తనఖా పెట్టిన ఇంటిని శాశ్వతంగా స్వాధీనం చేసుకున్న వ్యక్తి నుంచి తనకు తిరిగి ఇప్పించాలని కోరుతూ రెండు నెలలుగా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్నా అధికారులు కనీసం స్పందించడం లేదని అనకాపల్లి పట్టణానికి చెందిన దివ్యాంగుడు అండిబోయిన రమేష్‌ ఆరోపించారు. పట్టణంలో గాంధీనగరం అంజయ్యకాలనీలో ఫ్లాట్‌ నెం.7లో తన పేరున ఇల్లు ఉందని, ఆర్థిక అవసరాలతో వి.రమణ అనే వ్యక్తికి రూ.3 లక్షలకు తనఖా పెట్టానని, రెండేళ్ల తరువాత తిరిగి చెల్లించే ప్రయత్నం చేశానని, డబ్బు తీసుకోకుండా ఇల్లు తనది అంటున్నాడని వాపోయారు. దివ్యాంగుడైన తనను తీవ్రంగా వేధిస్తున్నాడని, న్యాయం చేయాలని పోలీస్‌, కలెక్టరేట్‌ అధికారులకు నాలుగు సార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ప్రతి వారం తప్పని ప్రదక్షిణలు

- కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌కు పోటెత్తిన అర్జీదారులు
- అర్జీల స్వీకరణతో సరిపెట్టేస్తున్నారని ఆవేదన
- మొత్తం 313 అర్జీల నమోదు

తుమ్మపాల: అర్జీదారుల ఆవేదన, అసహనాల మధ్య సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌ కార్యక్రమం సాగింది. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌ చుట్టూ ప్రతి వారం ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులను ప్రశ్నిస్తే కలెక్టరేట్‌ సిబ్బంది జోక్యం చేసుకుని బయటకు పంపేస్తున్నారని పలువురు వాపోయారు. కాళ్లరిగేలా కలెక్టరేట్‌కు వస్తే అర్జీలను పరిష్కరిస్తామని నోటి మాటగా చెప్పడమే పరిష్కారంగా చూపిస్తూ ఎండార్స్‌మెంట్‌తో అధికారులు ముగించేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తక్షణమే స్పందించాల్సిన ఫిర్యాదులకు కూడా 75 రోజులు, 105 రోజులు గడువు చూపిస్తూ పీజీఆర్‌ఎస్‌ వెబ్‌సైట్‌ రూపొందించారని కూటమి సర్కారుపై అర్జీదారులు మండిపడుతున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్‌) కార్యక్రమంలో కలెక్టర్‌ విజయ కృష్ణన్‌, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఎస్‌డీసీలు సుబ్బలక్ష్మి, రమామణి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 313 అర్జీలు నమోదయ్యాయి. వాటిలో 164 ఫిర్యాదులు రెవెన్యూ శాఖ పరిధిలో రాగా.. మిగిలినవి వివిధ శాఖల్లో నమోదయ్యాయి.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్‌ విజయ కృష్ణన్‌, డీఆర్వో సత్యనారాయణరావు

- అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటూ జి.శివానందం పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి లక్షల రూపాయలకు ఇతరులకు విక్రయించేశారని, రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా ఆక్రమణదారులు బోర్డును తొలగించి నిర్మాణ పనులు వేగవంతం చేశారని తెలిపారు. తక్షణం అధికారులు స్పందించాలని కోరారు.

భూములు ఆన్‌లైన్‌ చేయాలని నిరసన


భూములను ఆన్‌లైన్‌ చేయాలంటూ నిరసన తెలుపుతున్న రైతులు

పట్టాదారు పాసు పుస్తకాల ఆధారంగా భూములను ఆన్‌లైన్‌ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ మాకవరపాలెం మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులు కోడూరు పరిధిలో ఉన్న తమ భూములను ఆన్‌లైన్‌ చేయకపోవడంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రైతుల నుంచి ఎకరాకు రూ. లక్ష చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు కాకపోవడంతో గత్యంతరం లేక అప్పులు చేసి నగదు చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. రెవెన్యూ అధికారులు గ్రామంలో భూములను సర్వే చేసి ఆన్‌లైన్‌ చేయాలని పీజీఆర్‌ఎస్‌లో అధికారులను కలిసి విన్నవించుకున్నారు.

జిల్లా అధికారుల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం


కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా అధికారుల సంఘం కార్యవర్గం

తుమ్మపాల: జిల్లా అధికారుల సంక్షేమం కోసం జిల్లా అధికారుల సంఘం నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేయాలని కలెక్టర్‌ విజయ కృష్ణన్‌ కోరారు. సోమవారం జరిగిన జిల్లా అధికారుల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. వివిధ అంశాలపై చర్చ అనంతరం, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడిగా జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు, గౌరవ అధ్యక్షుడిగా జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా జిల్లా పంచాయతీ అధికారి సందీప్‌, జనరల్‌ సెక్రటరీగా డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జాయింట్‌ సెక్రటరీగా డ్వామా పీడీ పూర్ణిమాదేవి, కోశాధికారిగా జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్‌.ఎస్‌.మూర్తి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎస్‌డీసీ రమామణి, డీఈవో అప్పారావు నాయుడు, ఏపీసీఎస్‌ఎస్‌ ఎ.సూర్యప్రకాష్‌ ఎంపికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ కె.విజయ కృష్ణన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

చెరువును ప్రైవేటు భూమిగా మార్చేశారు..

నిన్నటి వరకు ప్రభుత్వ భూమిగా ఉన్న చెరువును.. నేడు రూ.20 కోట్ల విలువ చేసే ప్రైవేటు భూమిగా మార్చేస్తూ జిల్లా అధికారుల ఆదేశాలతో 22ఏ నుంచి తొలగించేసిన రెవెన్యూ అధికారులు తీరుపై నిరసనగా యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని పెదపల్లి, మంత్రిపాలెం, పెదగొల్లలపాలెం గ్రామాల యువకులు కలెక్టరేట్‌ ఎదుట ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. యలమంచిలి మున్సిపాలిటీ యర్రవరం రెవెన్యూ పరిధిలో చెరువుగా ఉన్న సర్వే నం.286లో 12.49 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత భాగం 3.27 ఎకరాలను సర్వే నం.286-2బీగా సబ్‌ డివిజన్‌ చేసి ప్రైవేటు వ్యక్తుల పేరున రాసిచ్చేయడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు భూమిని తనకు కేటాయిస్తూ కలెక్టర్‌ ప్రొసిడింగ్స్‌ ఇచ్చారంటూ అప్పలరాజు అనే వ్యక్తి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని, చెరువును కాపాడాలని కోరుతూ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే ఆక్రమణలను ప్రోత్సహించడంపై మండిపడ్డారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి కలెక్టర్‌ మంజూరు చేసిన ప్రొసిడింగ్స్‌ను పునః పరిశీలించాలని, 22ఏ తొలగింపు ప్రొసిడింగ్స్‌ను రద్దు చేయాలని కోరారు.


చెరువును కాపాడాలంటూ నిరసన తెలుపుతున్న మూడు గ్రామాల యువకులు

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పూర్వీకుల నుంచి తన వాటాగా వచ్చిన స్థలాన్ని తన సోదరుడు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని కశింకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన దివ్యాంగుడు నెల్లిముక్కు అప్పలకొండ అర్జీ అందజేశారు. తన తండ్రి అప్పన్నకు గ్రామంలో ఉన్న 6 సెంట్లను గ్రామపెద్దలు మూడు భాగాలుగా విభజించి కుమారులకు కేటాయిస్తూ తీర్మానం చేశారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. అయినా పెద్ద తమ్ముడు ఈశ్వరుడు దౌర్జన్యంగా తన స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడని, అతని నుంచి రక్షణ కల్పించి, స్థలం ఇప్పించాలని వేడుకున్నాడు.


వికలాంగుడు, నెల్లిముక్కు అప్పలకొండ

జిల్లా రెవెన్యూ సర్వీసెస్‌ భవనానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న కలెక్టర్‌ విజయకృష్ణన్‌

అనకాపల్లి: మండలంలో ఏఎంఏఎల్‌ కళాశాల జంక్షన్‌ సమీపంలో ఏపీ రెవెన్యూ జిల్లా సర్వీసెస్‌ అసోసియేషన్‌ నూతన భవన నిర్మాణానికి సోమవారం కలెక్టర్‌ విజయకృష్ణన్‌ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త జిల్లాగా ఏర్పడిన తరువాత అనకాపల్లిలో రెవెన్యూ శాఖకు భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చేరువ కావాలన్నారు. ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్‌ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను మరింత బాధ్యతాయుతంగా పారదర్శకంగా నిర్వహించి ప్రభుత్వానికి, రెవెన్యూ శాఖ కి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు, అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌ అధికారి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్‌ అసోసియేషన్‌ అమరావతి రాష్ట్ర కార్యదర్శి ఆర్‌.వి.రాజేష్‌, ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి జి.అనుపమ, ఏపీజేఏసీ జిల్లా చైర్మన్‌ ఎస్‌.ఎస్‌.వి.నాయుడు, జిల్లా అధ్యక్షుడు రత్నం, జిల్లా కార్యదర్శి ఎలమంచిలి శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చర్చలు లేవు.. సమాధానాలు లేవు

- తూతూమంత్రంగా కౌన్సిల్‌ సమావేశం

యలమంచిలి రూరల్‌: అజెండాలో అంశాలపై చర్చ లేదు.. సభ్యులు లేవనెత్తిన ప్రజా సమస్యలపై స్పష్టమైన సమాధానాలు లేవు.. విద్యుత్‌ శాఖ ఏఈపై కొత్తపాలెం వార్డు సభ్యుడి ఆగ్రహం.. మున్సిపాలిటీలో విలీనమై 14 ఏళ్లయినా అభివృద్ధి జాడ లేనందున కొక్కిరాపల్లిని పంచాయతీగా డీనోటిఫై చేయాలన్న డిమాండ్‌.. ఇదీ సంక్షిప్తంగా యలమంచిలి మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశంలోని ప్రధానాంశాలు. యలమంచిలి పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్‌ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్‌ సమావేశంలో అజెండాలోని 22 అంశాలపై చర్చ లేకుండానే ముగించారు. పారిశుధ్యం, తాగునీరు, రెవెన్యూ, వీధిలైట్లు, విద్య, నీటి పారుదల తదితర శాఖల అధికారులు తమ శాఖల్లో ప్రస్తుతం జరుగుతున్న పనులు, ప్రగతి గురించి సభ్యులకు వివరించారు. పారిశుధ్య నిర్వహణ బాగులేదని చైర్‌పర్సన్‌ రమాకుమారి అసంతృప్తి వ్యక్తం చేశారు. వీధిలైట్ల నిర్వహణపై ఫిర్యాదులు చేస్తున్నా సకాలంలో పరిష్కారం కావడంలేదని, రంగా వారి వీధిలో లైట్లు వెలగడం లేదని సంబంధిత విభాగం అధికారులకు రెండు నెలలుగా చెబుతున్నా పట్టించుకోలేదని మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ అర్రెపు గుప్తా, మరికొందరు సభ్యులు లేవనెత్తారు. సిబ్బంది కొరత కారణంగా ఆయా ప్రాంతాల్లో వారానికొకసారి మాత్రమే వీధి దీపాలను మార్చే అవకాశం ఉందని చైర్‌పర్సన్‌ చెప్పారు. కొత్తపాలెంలో కచ్చా రోడ్డు సమస్య ఎంతోకాలంగా సమావేశంలో ప్రస్తావిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్‌ రాపేటి సంతోష్‌ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ భవనాల ఆస్తి పన్ను బకాయిలు వసూలు కావడం లేదని ఆర్వో విశ్వేశ్వరరావు చెప్పారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ప్రవేశాల పెంపునకు సభ్యులు తోడ్పాటునందించాలని ఎంఈవో ఎం.శ్రీనివాసరావు కోరారు. తమ గ్రామంలో విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందని చెబుతుండగా విద్యుత్తు శాఖ ఏఈ కనకరాజు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంపై రామారాయుడుపాలెం వార్డు సభ్యుడు సుంకర మరిణేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సభ్యులు చెప్పేది వినరా అని ఏఈని ప్రశ్నించారు. పట్టణంలో మొబైల్‌ టాయిలెట్లు, జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి ప్రవేశించే ప్రాంతాల్లో మున్సిపాలిటీ నేమ్‌ బోర్డులు ఏర్పాటు చేయాలని కోఆప్షన్‌ సభ్యురాలు బీబీ కోరారు.


కొక్కిరాపల్లిని పంచాయతీగా డీనోటిఫై చేయాలని డిమాండ్‌ చేస్తున్న 23వ వార్డు సభ్యుడు మజ్జి రామకృష్ణ

కొక్కిరాపల్లిని పంచాయతీగా డీనోటిఫై చేయాలి

సమావేశం ఆఖర్లో 23వ వార్డు సభ్యుడు మజ్జి రామకృష్ణ ఓ వినూత్న డిమాండ్‌ పెట్టడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. 14 ఏళ్ల క్రితం కొక్కిరాపల్లి గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేస్తే మంచిదని నమ్మబలికి తమ గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. అభివృద్ధి జరగకపోగా ఆస్తి పన్ను పెరిగిందని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రజలకు లేకుండా చేశారని, అందుకే కొక్కిరాపల్లి గ్రామాన్ని మున్సిపాలిటీ నుంచి తొలగించి పంచాయతీగా డీనోటిఫై చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు తీర్మానం చేయాలన్నారు. తన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోకపోతే నిరాహార దీక్ష చేస్తానని ఆయన హెచ్చరించారు. మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ బెజవాడ నాగేశ్వర్రావు, దూది నర్సింహమూర్తి, పిట్టా సత్తిబాబు, పలువురు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నది

- ఎస్పీ తుహిన్‌సిన్హా


ఉద్యోగ విరమణ పొందిన పోలీస్‌ అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ తుహిన్‌ సిన్హా

అనకాపల్లి: పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదైనా, సమాజ రక్షణ కోసం చూపిన నిబద్ధత, సమర్థత, సేవా భావం ప్రశంసనీయమని ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన పోలీస్‌ సిబ్బందిని సోమవారం తన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పోలీస్‌ శాఖలో 35 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తూ విశిష్ట సేవలందించారన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలన్నారు. ఏదైనా సహాయం అవసరమైతే జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఎలమంచిలి రూరల్‌ అదనపు ఎస్‌ఐ ననేపల్లి సత్యనారాయణ, సీసీఎస్‌ ఎస్‌ఐ నట్టి సత్యనారాయణ, అనకాపల్లి ట్రాఫిక్‌ అదనపు ఎస్‌ఐ షేక్‌ రషీద్‌, పీసీఎస్‌ ఎస్‌ఐ షేక్‌ మదీనా వల్లి, డీసీఆర్‌బీ ఏఎస్‌ఐ జి.అర్జునరావు, పరవాడ ఏఎస్‌ఐ బి.ఎ. నాయుడులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్‌, ఎల్‌.మోహనరావు, ఎ.ఓ.ఎ.రామ్‌కుమార్‌, సీఐలు ఎస్‌.లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, ఎస్‌.బాల సూర్యారావు, టి.లక్ష్మి, కె.అప్పలనాయుడు, బి.రామకృష్ణ, ఎస్‌ఐ బి.సురేష్‌బాబు, పి.రమేష్‌, పి.కామేశ్వరరావు, ఎస్‌.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్‌

అచ్యుతాపురం రూరల్‌ : వేర్వేరు చోట్ల ఐదు బైకులను దొంగతనం చేసిన కశింకోట మండలం చెరకాం గ్రామానికి చెందిన రెడ్డి పైడంనాయుడు పోలీసులు అరెస్ట్‌ చేశారు. సీఐ నమ్మి గణేష్‌, ఎస్‌ఐ సుధాకర్‌ సోమవారం అచ్యుతాపురం కూడలిలో తనిఖీలు చేస్తుండగా టీవీఎస్‌ మోపెడ్‌పై వస్తున్న రెడ్డి పైడంనాయుడు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆయనను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టగా వేర్వేరు చోట్ల 5 బైకులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అచ్యుతాపురం పోలీసులు తెలిపారు.


బైక్‌ దొంగ వివరాలు తెలుపుతున్న పోలీసులు


చిన అప్పనపాలెంలో ఆలయ హుండీల చోరీ

- నగదు, బంగారం, వెండి వస్తువులతో పరారీ

బుచ్చెయ్యపేట: మండలంలో చిన అప్పనపాలెంలో పైడితల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సోమవారం ఉదయం గుడికి వెళ్లిన భక్తులు ఇక్కడ తలుపులు తెరచి, హుండీలు లేకపోవడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అమ్మవారి మెడలో వస్తువులతోపాటు ఆలయంలో సీసీటీవీ హార్డ్‌ డిస్క్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. ఆలయంలో హుండీ, గర్భగుడిలో మరొక హుండీతోపాటు పంచలోహ విగ్రహానికి ధరించిన పావు తులం బంగారు మంగళసూత్రాలు, 10 తులాల వెండి తాడులు ఎత్తుకుపోయారు. అమ్మవారి మెడలో ఉన్న మరో 50 తులాల వెండి వస్తువులను తీసి పక్కన పడేశారు. పగులగొట్టిన ఒక హుండీని ఆలయం వెనకాల, మరో హుండీని, తాళాలను పంట పొలంలో పారేశారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్‌ టీంని రప్పించి విచారణ చేస్తున్నారు.


నగదు తీసి హుండీని పడేసిన దొంగలు


ఆలయంలో సీసీటీవీ ఫుటేజీని పట్టుకుపోయిన దొంగలు

క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

కశింకోట: స్థానిక మోడల్ ప్రాథమిక పాఠశాల (బాలికల ప్రాథమిక పాఠశాల-2)లో వంద మందికిపైగా విద్యార్థులకు సోమవారం ప్రభుత్వం సరఫరా చేసిన బ్యాగులు, యూనిఫాం పంపిణీ చేశారు. ఎంఈవోలు కె.ఎస్.ఎన్. మూర్తి, సురేష్‌కుమార్, హెచ్‌ఎం నేమాల రమణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ప్రమాణ స్వీకారం



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న గత పాలకవర్గం సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పిల్లా హర శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బంధం వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు కొత్త భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. సమస్యలను పరిష్కారానికి ప్రతి సభ్యుడూ సహకరించాలన్నారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులను గత పాలకవర్గం శాలువా కప్పి సన్మానించింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి జగపతి, స్పోర్ట్స్ కార్యదర్శి మోహన్, లైబ్రరీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 25 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయానికి సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికకు 25 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల నుంచి ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, మోసపూరిత సంబంధిత ఫిర్యాదులు వచ్చాయన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ వెబ్ ఆప్షన్లపై అవగాహన

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ అభ్యర్థులకు సోమవారం ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ పదో తరగతి తర్వాత అత్యంత కీలకమైన దశలో సాంకేతిక విద్యపై మొగ్గు చూపడం చాలెంజింగ్ నిర్ణయమన్నారు. ఇందులో రాణి స్తే అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికపై పలు సూచనలు సలహాలు అందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 62 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,790	4,860
రెండో రకం	3,780	3,780
మూడో రకం	2,650	3,350

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: 8 వసంతాలు
పర్తిసాయి	: కుబేరా
షిర్డీసాయి	: సితారే జమీన్ పర్
వెంకటేశ్వర	: చంద్రేశ్వర
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: మార్గన్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 15 యూనిట్లు, బీ పాజిటివ్ -13, ఓ పాజిటివ్ -34, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 354 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 328 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

వ్యాధుల గాలం

- పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు
- అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ
- అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం



ఉడ్‌పేట వీధిలో పారని కాలువ



కొద్ది రోజుల క్రితం శుభ్రం చేసిన నాగులాపల్లి కాలువలో నిలిచిపోయిన చెత్త

అనకాపల్లి టౌన్: వర్షాకాలం వచ్చేసింది. వారం రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జ్వరాలతో ప్రజలు మంచాన బారిన పడుతున్నారు. ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతోంది. జీవీఎంసీ సిబ్బంది అరకొరగా కాలువలలో పూడికలు తీస్తుండడంతో దోమల వృద్ధి పెరుగుతోంది. పలు చోట్ల రోడ్లకు గోతులు ఏర్పడడంతో వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. చెత్తా చెదారాలు పేరుకుపోతున్నాయి. దీంతో దోమలు వ్యాప్తి పెరిగి రోగాలు ప్రబలే అవకాశం ఉంది. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ఎక్కువగా సంక్రమిస్తాయి. తాజాగా ఆస్పత్రులకు పెరుగుతున్న రోగుల తాకిడి దీన్ని స్పష్టం చేస్తుంది.

కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే చాలు...

సీజనల్ వ్యాధుల బారి నుంచి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే రక్షణ పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. తరచూ చేతులు కడుక్కోవడం ముఖ్యంగా ఆహారం తినడానికి ముందు, టాయిలెట్ ఉపయోగించిన తర్వాత ఈ విధంగా చేయాలి. వేడి వేడిగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం, పరిసరాలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేసుకోవడం, బయటి ఆహారాలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా వీధుల్లో అమ్మే ఆహార పదార్థాలను తినరాదు. పండ్లు, కాయగూరలను శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి. ఆహారాన్ని ఎప్పటికప్పుడు మూతపెట్టి ఉంచాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. దోమతెరలు ఉపయోగించాలి. ముఖ్యంగా చంటి పిల్లలకు తప్పనిసరి చేయాలి. దోమలు కుట్టకుండా శరీరం మొత్తం కప్పి ఉండేలా దుస్తులను ధరించాలి.

నీరు నిలిచే చోట దోమల వ్యాప్తి...

వాటర్ ట్యాంక్‌లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, చిన్న ప్లాస్టిక్ డబ్బాలు, గోతుల్లో వర్షపు నీరు దోమల వ్యాప్తికి కారణమవుతుంది. ఇంటి ముందర కాలువలు తరచూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి.



కాచిన వేడి నీరు

వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు

వ్యాధులు రాకుండా కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం. యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహిస్తున్నాం. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ చేయడం వంటివి చేస్తున్నాం.

– ఆర్ రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్, జీవీఎంసీ అనకాపల్లి జోన్

వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి



అనుకోని పరిస్థితుల్లో వర్షాల్లో తడవడం వల్ల తలనొప్పి, జ్వరం, అలసట, జలుబు, నీరసం, దగ్గు వంటి సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. శరీరం కాస్త అలసటగా ఉన్నా, తేడా వచ్చినా అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. తగిన రక్త పరీక్షలు చేయించుకోవాలి. వేడి వేడి ఆహార పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

–డాక్టర్ వాణీజగదీశ్వరి, పీహెచ్‌సీ, తుమ్మపాల

5న విద్యుత్ సమస్యలపై ఆందోళన



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంతో విఫలమైన కారణంగా ఈ నెల 5న విద్యుత్ సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు తెలిపారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త స్మార్ట్ మీటర్ల సామాన్య ప్రజలకు అమర్చడం అన్యాయమన్నారు. ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల విధానాన్ని అప్పటి టీడీపీ నాయకులు తిరస్కరించి, అధికారం చేపట్టిన తర్వాత ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. కూటమి అధికారం చేపట్టిన ఏడాదిలోనే రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు విధానాన్ని అమలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ అదేశాలు మేరకు కూటమి ప్రభుత్వం నడుచుకుంటుందని, ఈ విధానాన్ని స్వస్తి చెప్పకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో స్మార్ట్‌మీటర్లు బిగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు ఈ విధానాన్ని తిరస్కరించాలని, లేని పక్షంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి రాజానా దొరబాబు, కె. కోటపాడు మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు, జిల్లా నాయకులు వియ్యపు రాజు, ఫణేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో ఆదాయం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్



తేగాడలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: గ్రామాల్లో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమంలో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఎరువు తయారీ ద్వారా పంచాయతీకి ఆదాయాన్ని తీసుకురావడానికి దోహద పడాలని ఎంపీడీవో వి.వి. రవికుమార్ ఆదేశించారు. మండలంలోని తేగాడ పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. అక్కడ చెత్త సేకరణ తీరును పరిశీలించారు. అనంతరం సంపద కేంద్రం సందర్శించారు. తర్వాత ఉపాధి పథకం కూలీలతో సమావేశమయ్యారు. నిర్దేశించిన వేళల్లో పని చేసి నిర్ణీత రోజు వారీ కూలి పొందడానికి కూలీలు కృషి చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది, ఉపాధి సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామిగా జగన్నాథుడు



కశింకోటలో జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు



నృసింహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

కశింకోట: దేవాదాయ శాఖకు చెందిన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని లక్ష్మీనృసింహస్వామిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణుమూర్తి దశావతారాల్లో భాగంగా ఉత్సవాల నాల్గో రోజు లక్ష్మీనృసింహస్వామిగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన, భక్తుల గోత్ర నామార్చనలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రామ చరణాచార్యులు తదితరులు కార్యక్రమాలను జరిపారు. మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. చివరిగా ప్రసాద వితరణ చేశారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గూడ్స్‌రోడ్ ఇంద్రద్యుమ్న హాల్‌లో వేంచేసిన జగన్నాథ స్వామి సోమవారం భక్తులకు నృసింహావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బి. మురళి, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవేశాల్లో కశింకోట స్కూలు టాప్



విద్యార్థినులకు అభినందిస్తున్న ఎంఈవోలు మూర్తి, సురేష్‌కుమార్ తదితరులు

కశింకోట: విద్యార్థుల ప్రవేశాల్లో స్థానిక మోడల్ ప్రైమరీ స్కూలు (పూర్వ బాలికల ప్రాథమిక పాఠశాల-2) మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ గతంలో 1, 2 తరగతులు ఉండేవి. 3, 4, 5 తరగతులు హైస్కూలులో ఉండేవి. మోడల్ ప్రైమరీ స్కూలుగా ఏర్పాటు చేయడంతో 1 నుంచి 5 తరగతులను ఏర్పాటు చేశారు. హైస్కూలును 6 నుంచి పదో తరగతి వరకు నిర్వహణ చేపట్టారు. దీంతో 75 మంది 3, 4, 5 తరగతుల విద్యార్థులను స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలు నుంచి తీసుకువచ్చి ఈ స్కూలులో చేర్చారు. వీరితోపాటు అప్పటికే స్కూలులో చదివే విద్యార్థులు 14 మంది ఉన్నారు. వీరితోపాటు ఈ ఏడాది అదనంగా పలు ప్రైవేటు పాఠశాలలు, బడిఈడు పిల్లలు 17 మందిని వారి తల్లిదండ్రులను వివిధ తరగతుల్లో కొత్తగా చేర్చారు. ఇందుకు ప్రధానోపాధ్యాయుడు నేమాల రమణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేశారు. కశింకోటలోని 6వ ప్రాథమిక పాఠశాల, జమాదులపాలెం, నరసింగబిల్లి ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా ఏర్పాటు చేశారు. వీటిలో ఇక్కడి మోడల్ ప్రైమరీ స్కూలులో ఎక్కువ మంది విద్యార్థులు చేరి చదువుతున్నారు. దీంతో ఇది మండలానికి ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంఈవోలు కె.ఎస్.ఎన్. మూర్తి, సురేష్‌కుమార్ సోమవారం పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

హైస్కూల్లో 47 మంది ప్రైవేట్ విద్యార్థుల చేరిక



కొత్తగా చేరిన విద్యార్థులతో మామిడిపాలెం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనకాపల్లి: మండలంలో మామిడిపాలెం హైస్కూల్‌లో 47 మంది ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు కొత్తగా చేరారు. సోమవారం వారికి ఉపాధ్యాయులు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించలేక వీరిని తమ తల్లిదండ్రులు చేర్పించారని హెచ్‌ఎం శ్రీధర్ తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా మామిడిపాలెం హైస్కూల్‌లో బోధన కొనసాగుతోందన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో స్కూలు విద్యార్థి 588 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచాడన్నారు. వచ్చే ఏడాది మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, నారాయణరావు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, కరుణ జ్యోతి, వసంతరావు, లక్ష్మి, జి.లక్ష్మి, శ్రీను, వరప్రసాద్, ఈశ్వర్ బాబు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణపై ఫిర్యాదు

పరవాడ: పరవాడ రెవెన్యూ పరిధిలో సర్వే నెం.300లోని గెడ్డవాగును ఆక్రమించిన రియల్టర్‌పై చర్యలు కోరుతూ అనకాపల్లి ఆర్డీవోకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఓ రియల్టర్ తన జిరాయితీ భూములకు రోడ్డు ఏర్పాటులో భాగంగా పై సర్వే నంబర్‌లోని రూ.లక్షల విలువైన గెడ్డవాగును ఆక్రమించారని ఆరోపించారు.

చోడవరం ఎమ్మెల్యేపై చర్యలకు డిమాండ్

అనకాపల్లి: జిల్లాలో బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ అన్నపూర్ణను మానసిక వేధింపులకు గురిచేసిన చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజుపై కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల చోడవరం ఎమ్మెల్యే సిఫార్సు చేసిన వారికి సీట్లు కేటాయించలేదని అక్కసుతో తన ఆఫీసుకు పిలిపించుకుని 50 మంది అనుచరులు సమక్షంలో అవమానకరంగా మాట్లాడడంతో ప్రిన్సిపాల్ స్పృహతప్పి పడిపోయారన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన అత్యధిక మంది విద్యార్థినులకు సీట్లు ఇచ్చి ఆమె ప్రజల మన్ననలు పొందారన్నారు. అటువంటి మహిళా ఉద్యోగి గౌరవాన్ని అధికార దుర్వినియోగంతో దెబ్బతీయడం సరికాదన్నారు. మెరిట్ ప్రాతిపదికన అడ్మిషన్లు స్వీకరించకపోతే, డిపార్టుమెంట్ అధికారులతో విచారణ చేయించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగానీ సభ్యసమాజం తలదించుకునేలా దుర్మార్గంగా వ్యవహరించడం హేయమన్నారు.

'సిమెంటు పరిశ్రమ యూనిట్-2 వద్దు'

కశింకోట: మండలంలోని గొబ్బూరు వద్ద ప్రైవేటు సిమెంట్ పరిశ్రమలో రెండో యూనిట్ నిర్మాణానికి అనుమతి ఇవ్వొద్దని, అనుమతి ఇస్తే రైతులతో ఆందోళన చేపడతామని స్థానిక రైతు బుద్ధ వెంకటరమణ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం విశాఖలో వీఎంఆర్డీఏ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సాగునీటి చెరువులు ఆక్రమించి రోడ్లు, వంతెన, ఇతర నిర్మాణాలు చేస్తుండటంతో నీటి కొరతతో పంటలు పండకుండా రైతులను నష్టానికి గురి చేస్తున్నారన్నారన్నారు. రెండో యూనిట్ నిర్మాణానికి పంచాయతీ అనుమతి కూడా తీసుకోలేదన్నారు. గ్రామసభ పెట్టలేదని విమర్శించారు. రైతులు, ప్రజల శ్రేయస్సు దృష్ట్యా రెండో యూనిట్‌కు అనుమతి ఇవ్వొద్దని కోరారు.

దాబాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



దాబాల నిర్వాహకులను హెచ్చరిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

కశింకోట: మండలంలోని దాబాల్లో మద్యం విక్రయాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పి. మనోజ్‌కుమార్ హెచ్చరించారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మండలంలోని దాబాలను సిబ్బందితోపాటు వెళ్లి తనిఖీ చేశారు. నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా వాటి నిర్వాహకులతో మాట్లాడుతూ దాబాల్లో మద్యం నిల్వలు ఉంచడం గాని, విక్రయించడం గాని, సేవించడంగాని చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చిన్నపాటి తప్పిదాలతో జైలుపాలు

- జిల్లా పదో అదనపు న్యాయమూర్తి నరేష్



ఖైదీలతో మాట్లాడుతున్న అదనపు న్యాయమూర్తి నరేష్

అనకాపల్లి: చిన్నపాటి తప్పిదాలతో కొందమంది వ్యక్తులు జైలు పాలవుతున్నారని, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగితే ప్రభుత్వమే న్యాయం చేస్తుందని జిల్లా పదో అదనపు న్యాయమూర్తి వి.నరేష్ తెలిపారు. స్థానిక సబ్ జైలును ఏపీ హైకోర్టు ఆదేశాలు మేరకు సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. ఖైదీల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి హోమం



హోమం చేస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయంలోని ఆలయ మండపంలో ఆషాడ మాసం పంచమి తిథి సందర్భంగా సోమవారం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, వారాహి దేవికి హోమం నిర్వహించారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకుని హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ గొల్లబాబు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మంగళవారం
1-7-2025

బిజినెస్



స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
452	121
83,606	25,517

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,314	△	40
డోజోన్స్	43,981	△	180
ఎఫ్‌టీఎస్ఈ 100	8,761	▽	38
డాక్స్	23,910	▽	124
షాంఘై	3,444	△	20
నికాయ్	40,487	△	337

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.90	118.89
€	యూరో	ఎస్‌బీఐ	98.92	101.66
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.59	60.12
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.01	57.23
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.94	69.64
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.97	23.48
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.46	24.24
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.09	12.92

పొదుపు పథకాలపై వడ్డీ రేటు యథాతథం



న్యూఢిల్లీ: ఈ ఏడాది జూలై 1తో (నేటితో) ప్రారంభమయ్యే త్రైమాసికానికి చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయరాదని కేంద్రం నిర్ణయించింది. దీనితో ప్రధానంగా పోస్టాఫీసులు, బ్యాంకులు నిర్వహించే చిన్న మొత్తాల స్కీములపై వడ్డీ రేట్లు వరుసగా ఆరో క్వార్టర్‌లోనూ యథాతథంగా కొనసాగనున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సుకన్య సమృద్ధి పథకం కింద రేటు 8.2 శాతంగా, మూడేళ్ల టర్మ్ డిపాజిట్లపై 7.1 శాతంగా కొనసాగుతుంది. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీములు, కిసాన్ వికాస్ పత్రాలపై పైనా వరుసగా 7.1 శాతం, 4 శాతం, 7.5 శాతంగా వడ్డీ రేటు ఉంటుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై వడ్డీ రేటు 7.7 శాతంగా కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి మూణ్నెల్లకోసారి స్మాల్ సేవింగ్స్ స్కీములపై వడ్డీ రేట్లను నోటిఫై చేస్తుంది. చివరిసారిగా 2023–24 నాలుగో త్రైమాసికంలో కొన్ని స్కీముల్లో మార్పులు చేసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్ కీలకం: ఆర్‌బీఐ | వాణిజ్య వాహనాలకు ఇన్‌ఫ్రా దన్ను

పెట్‌కేర్ @ 60,000 కోట్లు

ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాల ఫోకస్
- మార్కెట్లో వాటా కోసం పోటాపోటీ
- ట్రెండ్స్, డిమాండ్‌పై మరింతగా దృష్టి
- అంకుర సంస్థల్లో పెట్టుబడులు

పెంపుడు జంతువులు ఇప్పుడు జీవితంలో, లైఫ్‌స్టయిల్‌లో భాగంగా మారుతున్నాయి. వాటిని కుటుంబ సభ్యులుగా పరిగణిస్తూ, వాటి సంరక్షణ కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు జంతుప్రేమికులు సిద్ధంగా ఉంటున్నారు. దీంతో ఖరీదైన ప్యాకేజ్డ్ పౌష్టికాహారం నుంచి సప్లిమెంట్లు, డయాగ్నొస్టిక్స్ సహా పెంపుడు జంతువుల సంరక్షణకు సంబంధించిన పెట్ మార్కెట్ భారీ స్థాయిలో విస్తరిస్తోంది. ప్రస్తుతం దేశీయంగా ఈ మార్కెట్ ఏకంగా 7 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 60,000 కోట్లు) స్థాయిలో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌ఎంసీజీ సంస్థలు కూడా దీనిపై మరింతగా ఫోకస్ పెడుతున్నాయి. మార్కెట్ వాటాను దక్కించుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఇటీవలే విప్రో కన్జూమర్ కేర్ వెంచర్స్ సంస్థ గూఫీ టెయిల్స్ అనే సంస్థలో ఇన్వెస్ట్ చేసింది. ఇక డ్రూల్స్‌లో మరో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే వాటాలు కొనుగోలు చేసింది. అలాగే ప్యూరినా అనే సంస్థను కొనుగోలు చేసింది. మరోవైపు, 2022లో క్యానిస్ లూపస్‌లో ఇమామి 30 శాతం వాటాలు కొనుగోలు చేసింది. అప్పటినుంచి క్రమక్రమంగా పెట్టుబడిని పెంచుకుంటూ వస్తోంది. ఇలా, మార్కెట్‌పై ఆసక్తిగానే ఉన్నప్పటికీ ప్రస్తుతానికి ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాలు ఆచితూచి అడుగేస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉన్న సంస్థల్లో మైనారిటీ వాటాలను తీసుకుంటూ మార్కెట్‌ను అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నాయని వివరించాయి. అయితే, డీ2సీ (డైరెక్ట్ టు కన్జూమర్) బ్రాండ్ల విశ్వసనీయతను పెంచుకుంటూ, వృద్ధి చెందే కొద్దీ వాటిని పెద్ద కంపెనీలు కొనుగోలు చేయొచ్చని పేర్కొన్నాయి. విస్తరణ, లాభదాయకత పెరిగే కొద్దీ తదుపరి దశలో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యే అవకాశాలూ వివరించాయి.

పట్టణీకరణ దన్ను..

వినియోగదారుల ధోరణులే కాకుండా వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ కూడా ఈ విభాగానికి దన్నుగా ఉంటోంది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ, ఆదాయాలు ఆర్జిస్తుండటం, కుటుంబ స్వరూపం మారుతుండటం వంటి అంశాలు కూడా కొంత దీనికి దోహదపడుతున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. తప్పనిసరి కాని అంశాలపై భారీగా ఖర్చు చేయగలిగేంతగా ఆదాయం ఉండే సంపన్న కుటుంబాలు, పెంపుడు జంతువులపై మరింతగా వెచ్చిస్తుండటాన్ని ఇది ప్రతిబింబిస్తోందని పేర్కొన్నాయి. 2019–2024 మధ్య కాలంలో దేశీయంగా జంతు సంరక్షణ ఉత్పత్తులు, సేవలు అందించే అంకుర సంస్థలు దాదాపు 121.3 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. 2021లో 13 డీల్స్ ద్వారా ఏకంగా 56.7 మిలియన్ డాలర్లు సేకరించాయి. 2024లో ఇది 17.4 మిలియన్ డాలర్లుగా ఉంది. బ్లింకిట్, జెప్టోలాంటి క్విక్-కామర్స్ ప్లాట్‌ఫాంలు విస్తరించే కొద్దీ పెట్ ఫుడ్, గ్రూమింగ్ ఉత్పత్తులు నిమిషాల్లో డెలివరీ అవుతున్నాయి. దీని వల్ల మార్కెట్ విస్తరిస్తున్నప్పటికీ, పోటీ కూడా తీవ్రతరమవుతోంది. పెట్ కేర్ ఉత్పత్తులకు క్విక్ కామర్స్ కీలకమైన మాధ్యమంగా మారే అవకాశం ఉండగా, అదే సమయంలో డీ2సీ సంస్థలు తమ బ్రాండ్లను నిలబెట్టుకోవడానికి, వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనేందుకు మరింతగా కసరత్తు చేయాల్సి రానుంది.

ఏటా 15% వృద్ధి..

ఈ విభాగం ఏటా 15 శాతం వృద్ధి చెందుతోందని కన్సల్టెన్సీ సంస్థ ఈవై-పార్థినాన్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత డిమాండ్‌లో పావు వంతు భాగాన్ని భర్తీ చేసేందుకు దిగుమతులపై ఆధారపడాల్సి ఉంటోందని పేర్కొన్నాయి. ఈ అంతరాలను తగ్గించేందుకు పెద్ద బ్రాండ్లు రంగంలోకి దిగుతున్నాయని, దిగుమతులకు ప్రత్యామ్నాయంగా, స్థానికంగా ఉత్పత్తి చేయడంపై దృష్టి పెడుతున్నాయని వివరించాయి. భారతీయ పెట్ పేరెంట్స్ కోసం భారతీయ బ్రాండ్లను తీర్చిదిద్దే అవకాశం ఉండటంతో విప్రో కన్జూమర్ కేర్‌లాంటి సంస్థలు ఈ విభాగంలోకి ప్రవేశిస్తున్నాయని పేర్కొన్నాయి. పెట్స్‌ను కుటుంబంలో భాగంగా చూసే ధోరణి పెరుగుతున్న కారణంగా వాటి సంరక్షణపై మరింతగా వెచ్చించడంపై వినియోగదారులు దృష్టి పెడుతున్నారు. దీంతో ఈ మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆహారం, గ్రూమింగ్, డయాగ్నొస్టిక్స్‌లాంటి అన్ని విభాగాల్లోను పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారని గూఫీ టెయిల్స్ వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో క్యాట్ ఫుడ్, ఫ్రీజ్-డ్రైడ్ మీల్స్, సప్లిమెంట్లకు మరింత డిమాండ్ నెలకొంటుందనే అంచనాలు ఉన్నట్లు పేర్కొన్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్



పరిశ్రమలు.. నేల చూపు!

- 9 నెలల కనిష్టానికి పారిశ్రామికోత్పత్తి
- మే నెలలో 1.2 శాతం వృద్ధి
- మైనింగ్, విద్యుత్‌లో మైనస్ పనితీరు

న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తి మే నెలలో 1.2 శాతానికి పరిమితమైంది. 2024 ఆగస్ట్ తర్వాత ఇదే అత్యంత కనిష్ట స్థాయి. ముందస్తు వర్షాల రాకతో తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల్లో పనితీరు నిదానించడం ఇందుకు దారితీసినట్టు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) ప్రకటించింది. 2024 మే నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 6.3 శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. ఇక ఈ ఏడాది ఏప్రిల్ నెలకు సంబంధించి ఐఐపీ వృద్ధి రేటు 2.7 శాతంగా కాగా, దీన్ని 2.6 శాతానికి ఎన్ఎస్‌వో సవరించింది.



- తయారీ రంగంలో వృద్ధి మే నెల 2.6%కి పరిమితమైంది. గతేడాది ఇదే నెలలో వృద్ధి 5.1%.
- మైనింగ్ రంగంలో ఉత్పత్తి మైనస్ 0.1 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో ఈ రంగంలో వృద్ధి 6.6 శాతంగా ఉంది.
- విద్యుత్ రంగంలో ఉత్పత్తి మైనస్ 5.8 శాతంగా ఉంది. క్రితం ఏడాది ఇదే నెలలో 13.7 శాతం వృద్ధి నమోదైంది.
- క్యాపిటల్ గూడ్స్ రంగంలో భిన్నమైన పరిస్థితి కనిపించింది. 14.1 శాతం వృద్ధి కనిపించింది. క్రితం ఏడాది మే నెలలో వృద్ధి కేవలం 2.6 శాతంగానే ఉంది.
- కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగంలో పనితీరు మైనస్ 0.7 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో 12.6 శాతం వృద్ధిని చూసింది.
- కన్జ్యూమర్ నాన్ డ్యూరబుల్స్ రంగంలోనూ ఉత్పత్తి మైనస్ 2.4 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో 7.6 శాతం వృద్ధి కనిపించింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో (ఏప్రిల్, మే) పారిశ్రామికోత్పత్తి వృద్ధి 1.8 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 5.7 శాతంగా ఉంది.

బ్యాంకు షేర్లలో లాభాల స్వీకరణ

నాలుగు రోజుల లాభాలకు బ్రేక్
- 84 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 121 పాయింట్ల నష్టం

ముంబై: బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణతో స్టాక్ సూచీల నాలుగు రోజుల లాభాలకు సోమవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 452 పాయింట్లు నష్టపోయి 83,606 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121 పాయింట్లు బలహీనపడి 25,517 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు అంతర్జాతీయ బలహీన సంకేతాల ప్రభావంతో రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 577 పాయింట్లు క్షీణించి 83,482 వద్ద, నిఫ్టీ 164 పాయింట్లు పతనమై 25,473 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. అయితే క్యాపిటల్ గూడ్స్, సర్వీసెస్, ఇండస్ట్రీయల్స్, ఫార్మా, కన్జూమర్ డ్యూరబుల్స్ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా కంపెనీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియాలో తైవాన్, హాంగ్‌కాంగ్, సింగపూర్ దేశాల స్టాక్ సూచీలు 1.50 శాతం నష్టపోయాయి.



యూరప్ మార్కెట్లు ఒకటిన్నర శాతం పతనమయ్యాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 26 పైసలు పతనమై 85.76 వద్ద స్థిరపడింది.
- టొరెంట్ ఫార్మా మెజారిటీ వాటా కొనుగోలు ప్రకటనతో జేబీ కెమికల్స్ ఫార్మాస్యూటికల్స్ షేరు 7% నష్టపోయి ఇంట్రాడే కనిష్టం రూ.1,678 వద్ద స్థిరపడింది. అయితే వాటా చేజిక్కించుకున్న టొరెంటో ఫార్మా షేరు 2% పెరిగి రూ.3,409 వద్ద ముగిసింది.
- ఎండీ, సీఈవో శ్రీకృష్ణన్ హరిహర శర్మ రాజీనామాతో కర్ణాటక బ్యాంకు షేరు 6% పతనమై రూ.196 వద్ద స్థిరపడింది.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్

- ఒక్కనామినేషనే దాఖలు కావడంతో ఎన్నిక లాంఛనమే
- తండ్రి వారసత్వంతో రాష్ట్ర బీజేపీలో చెరగని ముద్ర



ఎంవీపీకాలనీ: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పోకల వంశీ నాగేంద్ర మాధవ్ (పీవీఎన్ మాధవ్) నియామకం దాదాపు ఖరారైంది. కొన్ని రోజులుగా అధ్యక్ష పదవిపై నెలకొన్న తీవ్ర ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర బీజేపీ ముఖ్య నాయకులతో పాటు కేంద్ర పెద్దల మద్దతు పీవీఎన్ మాధవ్‌కు పుష్కలంగా ఉండటంతో ఆయన ఎన్నిక లాంఛనంగా మారింది. రాష్ట్ర అధ్యక్ష పదవి ఎన్నికలకు సంబంధించి సోమవారం ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడమే ఇందుకు స్పష్టమైన నిదర్శనం. పార్టీ ఎన్నికల పరిశీలకుడు పీసీ మోహన్, ఎన్నికల అధికారి పాక వెంకట సత్యనారాయణలకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో పాటు విశాఖ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు మాధవ్ నామినేషన్ పత్రాలను అందజేశారు. దీంతో ఆయన ఎన్నిక లాంఛనం కాగా, మంగళవారం అధికారిక ప్రకటన వెలువడనుంది.

తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకొని...

పీవీఎన్ మాధవ్.. రాష్ట్రంలో బీజేపీ అగ్ర నాయకుల్లో ఒకరిగా నిలిచిన దివంగత పీవీ చలపతిరావు తనయుడు. బీజేపీ ఆవిర్భవించిన తొలినాళ్లలో పీవీ చలపతిరావు రాష్ట్ర పార్టీ ముఖ్య నాయకుల్లో ఒకరుగా విశేష సేవలందించారు. ఆంధ్ర ఉద్యమంతో పాటు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1945లోనే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి, 1974, 1980లో ఎమ్మెల్సీగా సేవలు అందించి 87వ ఏట మరణించారు. ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న పీవీఎన్ మాధవ్, తండ్రి బాటలోనే పయనించి ఆర్‌ఎస్‌ఎస్‌లో సభ్యుడయ్యారు. తొలి నుంచి బీజేపీలో క్రియాశీలక పాత్ర పోషించారు. విశాఖలో అనేక బీజేపీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి అగ్ర నాయకుల మన్ననలు అందుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేవైఎంలో (భారతీయ జనతా యువ మోర్చా) పలు కీలక పదవులు నిర్వహించారు. 2017లో విశాఖ నుంచి శాసనమండలికి (ఎమ్మెల్సీగా) ఎన్నికై పార్టీకి విలువైన సేవలు అందించారు. శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గత కొన్నేళ్లుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన ఎన్నిక దాదాపు ఖరారైనందున విశాఖలోని బీజేపీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సాహితీ ప్రియుల మనస్సుల్లో చిరస్థాయిగా సత్యప్రియ

- మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రగాఢ సంతాపం

దేవరాపల్లి: సాహితీవేత్త, రిటైర్ట్ టీచర్, ఉపాధ్యాయ మాసపత్రిక పూర్వ సంపాదకుడు బీల సత్యప్రియ ఆకస్మిక మరణం సాహిత్య ప్రియులకు తీరని లోటని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు. మండలంలోని వేచలం గ్రామానికి చెందిన సత్యప్రియతో తనకున్న సాన్నిహిత్యాన్ని సోమవారం స్థానిక విలేకర్లకు వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు, ఉద్యోగుల పదవీ విరమణ సందర్భంగా ఆయన రాసిన ప్రశంసా పత్రాలు సాహిత్య ప్రియుల హృదయాలను ఎంతగానో రంజింప చేసేవన్నారు. ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసిన సత్యప్రియ, మాతృభాష తెలుగుపై ఎనలేని పట్టు సాధించారన్నారు.

నాలుగు చోరీ కేసుల్లో నలుగురు నిందితుల అరెస్ట్

- రూ.10.95 లక్షల నగదు, 237.8 గ్రాముల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసరావు



చోరీల నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది



స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, వెండి ఆభరణాలు

మాకవరపాలెం: రెండేళ్ల కాలంలో జరిగిన నాలుగు చోరీ కేసుల్లో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10.95 లక్షల నగదు, 237.8 గ్రాముల బంగారం, 706 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2023 ఏప్రిల్‌లో మండలంలోని దుంగలవాని పాలెం వద్ద పింఛన్‌దారులకు పంపిణీ చేయాల్సిన రూ.16.15 లక్షలు చోరీకి గురయ్యాయి. 2024లో మండల కేంద్రంలోని ముత్యాల సత్యనారాయణ నివాసం, వెంకన్నపాలెంలోని ఓ ఇంటిలో జరిగిన చోరీలతో పాటు బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి నుంచి నగదు కాజేసిన ఘటనలపై విచారణ చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ఈ వేర్వేరు కేసుల్లో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు పోలీసులు మండలానికి చెందిన దల్లి కామిరెడ్డి, కచ్చాల చిరంజీవి, సఖినేటి సాయిలను అరెస్టు చేశారన్నారు. ఈ నేపథ్యంలో బిక్కవోలు పోలీసులతో కలసి మాకవరపాలెం మండల పరిధిలో జరిగిన నాలుగు చోరీల్లో పై ముగ్గురితోపాటు మండల కేంద్రానికి చెందిన దొండపాటి రవీంద్రకుమార్‌ను విచారించామన్నారు. ఈ విచారణలో పింఛను నగదుతోపాటు మరో మూడు చోరీల్లో నలుగురి పాత్ర ఉన్నట్టు గుర్తించామన్నారు. నిందితుల వద్ద నుంచి ఇప్పటికే బిక్కవోలు పోలీసులు రూ.6.85 లక్షల నగదు, 71 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోగా.. తాజాగా సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు బృందాల ద్వారా రూ.4.10 లక్షల నగదు, 166.8 గ్రాముల బంగారం, 706 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలి ఉన్న నగదును కూడా రికవరీ చేస్తామని డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసులను ఛేదించిన సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.

గంజాయి కేసులో 14 ఏళ్ల జైలు

- మరో కేసులో నిందితుడికి 12 సంవత్సరాల కారాగార శిక్ష

విశాఖ లీగల్: గంజాయి రవాణా కేసుల్లో నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ సోమవారం ఇద్దరు నిందితులకు జైలు శిక్షలు విధించారు. వివరాలను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ఎన్‌వీ ప్రసాద్ వెల్లడించారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం రాయవరం నివాసి అయిన నల్ల తేజోమూర్తి 2019 ఫిబ్రవరిలో యలమంచిలి వద్ద ఒక వ్యాన్‌లో 200 కేజీల గంజాయిని రవాణా చేస్తూ రెడ్హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ నేరానికిగాను కోర్టు అతనికి 14 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.1.40 లక్షల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం, రావాలపల్లికి చెందిన దేవర శివ అనే ట్రాక్టర్ డ్రైవర్ 2017 ఫిబ్రవరిలో కొయ్యూరు వద్ద 96 కేజీల గంజాయితో పట్టుబడ్డాడు. ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు తరలించే ప్రయత్నంలో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో కోర్టు అతనికి 12 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.1.20 లక్షల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్షను అనుభవించాలి.

పోలీసుల అదుపులో చీటీల నిర్వాహకులు



కె.కోటపాడు పోలీస్‌స్టేషన్ వద్ద ఒంటిపై డీజిల్ పోసుకున్న పైడప్పారావును వారిస్తున్న బాధితులు, పోలీసులు

కె.కోటపాడు : చీటీలు నిర్వహిస్తూ ఆ డబ్బులతో పరారైన చౌడువాడ గ్రామానికి చెందిన పెదిరెడ్ల పద్మజతో పాటు ఆమె కుమారుడు సాయి, కొత్తూరు బాపనయ్యలను ఆదివారం రాత్రి కె.కోటపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు. కె.కోటపాడు పోలీస్‌స్టేషన్‌కు సోమవారం మధ్యాహ్నం వచ్చిన అనకాపల్లి డీఎస్పీ శ్రావణిని బాధితులు కలిసి తమ గోడు వినిపించుకున్నారు. చట్ట ప్రకారం బాధితులకు న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

ఒంటిపై డీజిల్ పోసుకున్న బాధితుడు

చీటీల నిర్వాహకురాలు పద్మజను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న సమాచారంతో సోమవారం బాధితులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఆమెను చూపించాలని కోరారు. ఇంతలో గరుగుబిల్లి గ్రామానికి చెందిన ఇస్సారపు పైడప్పారావు తన వెంట తీసుకొచ్చిన డీజిల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. మిగతా బాధితులతో పాటు పోలీసులు వెంటనే స్పందించి పైడప్పారావును మందలించారు.

సాగురైతులకు పట్టాలివ్వాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సాగుదారులు, నాయకులు

మాకవరపాలెం : బంజరు భూములు సాగు చేస్తున్న తమకు పట్టాలు ఇవ్వాలని సాగురైతులు రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. రాచపల్లి రెవెన్యూ 737 సర్వే నంబర్‌లో సుమారు 1500 ఎకరాల బంజరు భూమి ఉంది. దీనిని గత 40 ఏళ్లకుపైగా చుట్టపక్కల గ్రామాలకు చెందిన రైతులు జీడి, మామిడి పంటను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ భూమిని పరిశ్రమలకు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా ఈ భూమిని వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్లు సర్వే చేస్తున్నారు. సోమవారం యరకన్నపాలెం వద్ద జరుగుతున్న సర్వే ప్రాంతానికి సాగు రైతులు భారీగా చేరుకున్నారు. సర్వే పరిశీలనకు వచ్చిన తహసీల్దార్ వెంకటరమణతో మాట్లాడారు. సాగులో ఉన్న వారికి సైతం సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడం ఏమిటని ప్రశ్నించారు. 40 ఏళ్లగా ఈ భూములను సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంతంలో ఆన్‌రాక్ పరిశ్రమకు 2400 ఎకరాల భూమిని సేకరించారని, 18 ఏళ్లు కావస్తున్నా నిర్వాసితులకు ఇప్పటికీ హామీలు అమలు చేయలేదన్నారు. 737లోని భూములను పరిశ్రమలకు ఇచ్చి సాగుదారులకు అన్యాయం చేయొద్దన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ఉన్నతాధికారుల ఆదేశాలతో భూములను సర్వే చేస్తున్నామన్నారు. సాగులో ఉన్న ప్రతి రైతు వివరాలను నమోదు చేసి నివేదిక అందజేస్తామన్నారు. పట్టాల విషయాన్ని కూడా కలెక్టర్‌కు తెలియజేస్తామన్నారు.

నేటి నుంచి అమల్లోకి పెరిగిన రైలు చార్జీలు



తాటిచెట్లపాలెం: సామాన్య, మధ్య తరగతి ప్రయాణికుల ప్రధాన రవాణా సాధనం రైలు. ఇతర ప్రయాణ సాధనాలతో పోల్చుకుంటే తక్కువ చార్జీలకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో రైల్వే కీలకం. రైల్వే చార్జీలు స్వల్పంగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పెంచిన చార్జీలు నేటి(జూలై 1) నుంచి అమల్లోకి రానున్నాయి. సబర్బన్(సింగిల్ జర్నీ), సీజన్ టికెట్స్(సబర్బన్, నాన్ సబర్బన్), రిజర్వేషన్ చార్జీలు, సూపర్‌ఫాస్ట్ చార్జీలు, ఇతర చార్జీల్లో ఎలాంటి మార్పుల్లేవు.

ఆర్డినరీ నాన్ ఏసీ(నాన్–సబర్బన్)

సెకండ్ క్లాస్ మొదటి 500 కి.మీ.లకు మార్పులేదు. ఆపై కి.మీ.కు 0.5(అర) పైసా చొప్పున పెంచారు. 501 నుంచి 1500 కి.మీ. వరకు రూ.5, 1501 నుంచి 2500 కి.మీ. రూ.10, 2501 నుంచి 5 వేల కి.మీ. వరకు రూ.15 చొప్పున చార్జీలు పెరగనున్నాయి. స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్‌కు కి.మీ.కు అర పైసా చొప్పునే పెరుగుదల ఉంది.

మెయిల్ ఎక్స్‌ప్రెస్(నాన్–ఏసీ): సెకండ్ క్లాస్, స్లీప్ క్లాస్, ఫస్ట్ క్లాస్ కేటగిరీలో కిలో మీటర్‌కు పైసా చొప్పున చార్జీలలు పెరిగాయి.

ఏసీ క్లాస్‌లు: ఏసీ చైర్‌కార్, 3 టైర్, 2 టైర్, ఫస్ట్ క్లాస్/ఈసీ/ఈఏ కిలో మీటర్‌కు 2 పైసలు చొప్పున పెంచిన చార్జీలు అమల్లోకి రానున్నాయి.

బీసీ బాలికల హాస్టల్ ఆకస్మిక తనిఖీ

- ఆహార నాణ్యతపై హోం మంత్రి అనిత అసంతృప్తి
- సీసీ కెమెరాలు లేకపోవడంపై ఆగ్రహం



ఆహార నాణ్యతపై నిలదీస్తున్న మంత్రి అనిత

పాయకరావుపేట: పట్టణంలోని బీసీ బాలికల కాలేజ్ హాస్టల్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న మంత్రి.. హాస్టల్‌లోని సమస్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు లేకపోవడం పట్ల ఆగ్రహం చెందారు. హాస్టల్ వార్డెన్ గైర్హాజరు కావడం పట్ల మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి, ఆహార నాణ్యత తక్కువగా ఉండడంతో అధికారులపై సీరియస్ అయ్యారు. మెనూను సక్రమంగా అమలు చేయకపోవడాన్ని గుర్తించారు. ప్రభుత్వ హాస్టళ్లలో కూడా సన్న బియ్యాన్ని వాడాలని స్పష్టం చేశారు. హాస్టల్ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు.

వినతులను పరిష్కరించాలి

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ ప్రజా దర్బార్‌కు వచ్చే వినతులు, భూ సంబంధిత ఫిర్యాదులను నిశితంగా పరిశీలన చేసి న్యాయబద్ధంగా ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు 11 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన వినతులను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించాలని చైర్మన్, కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఎస్టేట్ అధికారి దయానిధి, ప్రధాన గణాంక అధికారి హరిప్రసాద్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.